మర్చిపోవద్దు. మీకు లోపల యోగ్యత లేకపోతే, అర్హత లేకపోతే కళ్ళు ఉన్నా చూడలేరు, చెవులు ఉన్నా వినలేరు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-03-06, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈశ్వరుడికి తెలియకుండా ఈ సృష్టిలో చిన్న సంఘటన కూడా జరగటానికి వీలు లేదు. అందుచేత మనం ఆయనకు శరణాగతి చేస్తే దుఃఖం నశిస్తుంది. బయట ఉన్న రాక్షసుల కంటే లోపల రాక్షసులను జయించటం కష్టం. బయట ఉన్న రాక్షసులను బాంబులు వేసి చంపేయవచ్చు కాని లోపల రాక్షసులను అలా చంపలేము. మన పునర్జన్మలకు కారణం లోపల ఉన్న రాక్షసులు. కోరిక, కోపం ఇవి లోపల ఉన్న రాక్షసులు. ఇవి రజోగుణంలో నుండి వస్తాయి. వీటిలో నుండి దుర్గుణాలు, దురాచారాలు, పునర్జన్మలు అన్నీ వస్తాయి. మనిషిలో రజోగుణం ఎంత కాలం అయితే ఉందో అంతకాలం ఇవి రెండూ వస్తూ ఉంటాయి. శరీరం కూడా నీడ ఉంటుంది దీనిని ఎవరూ ఆపు చేయలేరు. అలాగే మీలో అహంభావన ఉన్నంతకాలం, దేహ భావన ఉన్నంత కాలం మీరు ఎన్ని జన్మలు ఎత్తినా అశాంతి మీకూడా ఉంటుంది, మీ అడుగులో అడుగు వేసుకొంటూ మీ కూడా ఉంటుంది. దేహం కంటే ఇంద్రియాలు గొప్పవి, ఇంద్రియముల కంటే మనస్సు గొప్పది, మనస్సు కంటే బుద్ధి గొప్పది, బుద్ధి కంటే చైతన్యం గొప్పది అని పరమాత్మ గీతలో చెప్పాడు. ఇవి అన్నీ ఒక దానికంటే ఒకటి లోతుగా ఉంటాయి. శరీరం కంటే ఇంద్రియాలు లోతుగా ఉంటాయి, వీటికంటే మనస్సు ఇంకా లోపల ఉంటుంది, మనస్సు కంటే బుద్ధి ఇంకా లోపల ఉంటుంది, బుద్ధి కంటే ఆత్మ ఇంకా లోపల ఉంటుంది. లోపలకు అంత దూరం వెళితేనేగాని ఆత్మ మనకు గోచరం కాదు. సత్వగుణం ప్రాక్టీసు చేయకుండా మనం లోపల ఉన్న రాక్షసులను జయించలేము. ఏదైనా సహజంగా రావాలి, కృత్రిమంగా వచ్చినది నిలబడదు. నేను ప్రయత్నం చేసి, ఎంతో కష్టపడి మీకు సబ్జక్టు చెపుతున్నాను అనుకోండి అంటే దాని తాలుక అనుభవం నాకు లేదు అని అర్థం. నేను చెప్పేమాట అప్రయత్నంగా, సహజంగా వస్తేనే నేను చెప్పగలను, మీరు వినగలరు, దాని వలన మీకు శాంతి కలుగుతుంది. నేను ఏదో కష్టపడిపోతున్నాను అనుకొంటే మీకు శాంతి రాదు, నాకు కష్టం మిగులుతుంది.

అజ్ఞానాన్ని విడిచిపెట్టేస్తే జ్ఞానం ఎలా ఉంటుందో మీకు తెలుస్తుంది, జడాన్ని

విడిచిపెట్టేస్తే చైతన్యం ఎలా ఉంటుందో మీకు తెలుస్తుంది, అనాత్మను విడిచిపెట్టేస్తే ఆత్మ గురించి మీకు తెలుస్తుంది, దానిని విడిచిపెట్టకుండా ఇది తెలియదు కదా అంటున్నారు భగవాన్. మనం అనాత్మను విడిచిపెట్టలేకపోతున్నాము. నీవు ఎంతకాలం అయితే మనో దేహముల నుండి బయటకు రాలేవో అంతకాలం చైతన్యస్థాయిని పొందలేవు. ఇలా జన్మిస్తూనే ఉంటావు, మరణిస్తూనే ఉంటావు, ఇదే సంసారం. నేను ఉన్నాను, అది చైతన్యం. నేను అలాగ ఉన్నాను, నేను ఇలాగ ఉన్నాను, నేను తక్కువగా ఉన్నాను, నేను ఎక్కువగా ఉన్నాను అనుకోవటం అనాత్మ, అది అసత్యం. ఇలా మనం కాని దానితో తాదాత్మ్యం పొందుతున్నంత కాలం మనం అసత్యంలో వున్నంతకాలం ఎంతటి వారికైనా పునర్జన్మలు తప్పవు. దేహము నేను అనే తలంపులోనుండి బయట పడనంతకాలం ఏ మనిషి కూడా అశాంతిలో నుండి బయటపడలేడు. మనస్సును కోరిక, కోపంలోనుండి విడిపించాలి. ఎప్పుడయితే మనస్సును వాటిలో నుండి విడిపించామో అంతకంటే లోతులలో ఉన్న చైతన్యంలో ఐక్యమవుతుంది. ఇంద్రియ నిగ్రహం లేకుండా, మనో నిగ్రహం లేకుండా మనస్సుకు లోచూపురాదు. భగవంతుడు ఈ ప్రపంచాన్ని ఎందుకు సృష్టించాడు, ఈ ప్రపంచం ఎందుకు గోచరిస్తోంది అని ఒకరు భగవాన్‌ను అడిగారు. ఈ ప్రపంచాన్ని ఎందుకు సృష్టించాడు అని నీ లోపల ఒకడు ఉండి అడుగుతున్నాడు కదా, వాడిని తెలుసుకోవటానికే ఈ ప్రపంచాన్ని సృష్టించాడు. అంటే నన్ను నేను తెలుసుకోవాలి కదా అన్నాడు. ఏ నేను అయితే నన్ను నేను తెలుసుకోవాలి అని అంటోందో ఆ నేనునే అడుగు, నిన్ను నీవు తెలుసుకో అని దానినే అడుగు నన్ను అడుగుతావు ఏమిటి అంటున్నారు భగవాన్. ఒక్క చైతన్యం తప్పించి అంతా కల్పితమే. ఈ కల్పితాన్ని ఎంతకాలం అయితే విడిచి పెట్టమో అంత వరకు సత్వగుణం నీకు స్వాభావికంగా రాదు. మనకు లోపల సత్వగుణం ఉండదు, సత్వగుణం ఉన్నట్లు నటిస్తాము. ఇలా నటించటం వలన లోకాన్ని మోసం చేయగలము కాని భగవంతుడిని మోసం చేయలేము. సత్వగుణం స్వాభావికంగా ఉండాలి, అప్పుడు అది సహజం అవుతుంది, అప్పుడు నీవు కోపంలో నుండి, కోరికలో నుండి విడుదల పొందుతావు అని పరమాత్మ చెపుతున్నాడు. రాముడు అద్దంలాంటివాడు అన్నాడు వాల్మీకి. మనం రోజూ స్నానం చేసిన తరువాత అద్దంలో చూసుకొంటాము. మొఖం బాగుందా? లేదా? అని చూసుకొంటాము, ఏవైనా మరకలు ఉంటే తుడిచేసుకొంటాము, పౌడర్ వ్రాసుకొంటాము. ఇక్కడ వాల్మీకి ఏమి చెపుతున్నాడు అంటే రాముడనే అద్దంలో నిన్ను నీవు చూసుకో అంటున్నాడు. రాముడి గుణాలు నీ గుణాలు

సరిపోతున్నాయా? లేదా? అని చూసుకో. రాముడి గుణాలకు, నీ గుణాలకు తేడా ఉంటే నీ గుణాలను తొలగించుకొని రాముడి గుణాలను అలవర్చుకో, అప్పుడు ఆయన స్వరూపం నీకు దొరుకుతుంది, అదే మోక్షం అని వాల్మీకి చెపుతున్నాడు.

నేను ఏదైనా మాట మాట్లాడిన తరువాత నాకు ఆందోళన వస్తోంది అనుకోండి, శరీరంతో ఏదో పని చేసిన తరువాత నాకు అశాంతి వస్తోంది అనుకోండి, మనస్సులో ఏదో ఆలోచన వచ్చి వెళ్ళిపోయిన తరువాత నాకు అశాంతి వస్తోంది అనుకోండి, నాకు సత్వగుణం లేదు అని అర్థం. నేను ఏదైనా మంచి పని చేసినా అది నన్ను ఉద్రేక పరచకూడదు. అశాంతి, ఉద్రేకం వస్తూ ఉంటే పైకి మంచి పనిగా కనిపించినా అది నన్ను బాగు చేయలేదు. నా మాట, చేత, తలంపు నన్ను ఉద్రేకపరచకూడదు. అలా ఉద్రేకపరుస్తూ ఉంటే అవి రజోగుణాన్ని పెంచేస్తాయి. రజోగుణం పెరిగిపోతూ ఉంటే నీవు కోరిక, కోపంల నుండి బయటకు రాలేవు అని పరమాత్మ చెపుతున్నాడు. మీకు అనేకమంది బంధవులు, స్నేహితులు ఉన్నప్పటికీ, అర్థబలం అంగబలం ఉన్నప్పటికి, వాతావరణ పరిస్థితులు కలిసివస్తున్నప్పటికీ, మీరు ఏ పని చేసినా కలిసివస్తున్నప్పటికీ, మీ ఇంద్రియాలు మనస్సు మీ అదుపులో ఉన్నప్పడు అది తీసుకొని వచ్చే సుఖాన్ని, శాంతిని మీ బంధువులుగాని, స్నేహితులు గాని, పరిస్థితులు గాని తీసుకొని రాలేవు. ఎవరి దేహం వారిది, ఎవరి మనస్సు వారిది, ఎవరి గుణం వారిది, ఇది అంతా మాయ. మీ శరీరంతో ఘనకార్యాలు చేయవచ్చు, మీ మనస్సులోకి గొప్పగొప్ప ఆలోచనలు రావచ్చు, ఇవి అన్నీ కాల ప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. అందరి హృదయాలలో ఉన్న సత్యాన్ని ఎవడైతే దర్శించాడో వాడే సుఖాన్ని, శాంతిని పొందుతాడు, వాడే నిజమైన సుఖి, అదే నిజమైన దర్శనం. మిగతావి ఏమి సాధించినా అన్నీ కాల ప్రవాహంలో కొట్టుకొని పోతాయి. మీరు పెద్ద కాలేజీ కట్టించవచ్చు. ఈ దేహం ఎంత నిజమో, లోకం ఎంత నిజమో, మనస్సు ఎంత నిజమో అది కూడా అంతే నిజం. దాని వలన పుణ్యం వస్తుంది. పుణ్యం అయినా, పాపం అయినా ఒక కాలంలో చేస్తాము, ఇంకో కాలంలో అనుభవిస్తాము, అన్ని కాల ప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. చైతన్యం సరళమైనది, నిశ్చలమైనది, శుద్ధమైనది, నీ మొఖాన్ని అటు తిప్పు అంటున్నాడు పరమాత్మ.

మనం ఎవరి పట్ల అసూయ పడకూడదు. ఎందుచేతనంటే మనకు ఎవరిపట్ల అసూయ వచ్చినా మనస్సుకు లోచూపు కలుగదు. మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందాలంటే మనకు అసూయ రాకూడదు. మనం అసూయతో ఉంటే బతికున్నంతకాలం

అశాంతి, చనిపోయిన తరువాత పాడు లోకాలు. దానాలలో కర్ణుడికి ఉన్నంత పేరు పాండవులకు, కౌరవులకు లేదు. ధుర్యోధనుడికి కర్ణుడికి బాగా స్నేహం. అటువంటి ధుర్యోధనుడికి కర్ణుడు మీద అసూయ వచ్చింది. ఎవరైనా దానం కోసం వస్తే నా దగ్గరకు పంపండి కర్ణుడి దగ్గరకు పంపవద్దు అని చెప్పాడు. ఎవరో ఒకరు వస్తున్నారు ధుర్యోధనుడు వారికి అడిగినది ఇచ్చి పంపుతున్నాడు. ఇంతలో వర్షకాలం వచ్చింది. ఒక బ్రాహ్మణుడు వచ్చి నేను యజ్ఞాలు, యాగాలు చేయటానికి అలవాటుపడ్డాను, పొడిపుల్లలు కావాలి అని అడిగాడు. బాగా వర్షాల వలన పుల్లలు తడిసిపోయాయి, మీకు పొడి పుల్లలు ఇవ్వలేను అని ధుర్యోధనుడు చెప్పాడు. ఆ బ్రాహ్మణుడు కర్ణుడి దగ్గరకు వెళ్ళి అడిగాడు. కర్ణుడి దగ్గర ఉన్న పుల్లలు కూడా తడిసిపోయి ఉన్నాయి. నేర్చుకొన్నదానికి, స్వాభావికంగా వచ్చిన దానికి తేడా ఇక్కడ చూడండి. కర్ణుడు ఏమి చెప్పాడు అంటే మనం ఉన్న ఇల్లు విప్పేసి లోపల ఉన్న దూలాలు ఇవ్వండి, వారు యజ్ఞం చేసుకొంటారు అని చెప్పాడు. ఆ వార్త ధుర్యోధనుడికి తెలిసింది. అప్పుడు వాడు కళ్ళు తెరిచాడు. ఇది నాకు తట్టలేదు. ఇవ్వటం అనేది నీకే సాధ్యం, నాకు సాధ్యం కాదు. నిన్ను చూసి నేను అసూయ పడ్డాను. నీవు నీవే, నేను నేనే అన్నాడు ధుర్యోధనుడు. నీకు సహజమైనది కాబట్టి అది నీకు స్ఫురించింది. నాది కృత్రిమం అందుచేత నాకు స్ఫురించలేదు. ఆ గుణానికి సంబంధించినంత వరకు నీ ఔన్నత్యానికి నేను సరిపోను. కర్ణుడిని చూసి ధుర్యోధనుడికి అసూయ వచ్చింది అంటే ఎవరూ నమ్మరు ఎందుచేతనంటే వారు స్నేహితులు. ఇది మీకు ఎందుకు చెపుతున్నాను అంటే ఆధ్యాత్మిక సాధనలో బహుజాగ్రత్తగా ఉండాలి. మాకు కోరికలు లేవు అనుకొంటారు కాని ఎక్కడో లోపల సూక్ష్మాతి సూక్ష్మంగా ఉంటుంది. గురువు నీ లోపల ఉన్న వికారములను, మాయను, అజ్ఞానాన్ని అన్నింటిని కక్కిస్తాడు అప్పుడు గాని గురువు ఏ స్థానంలో ఉన్నాడో ఆ స్థానాన్ని నీవు పొందలేనని గురువుకు తెలుసు. లోపల వాసనలు, వికారాలు ఉన్నప్పుడు నీవు జన్మలు రాకుండా ఆపుచేసుకోలేవు. చిన్న తనంలో అమాయకంగా రోజులు వెళ్ళి పోతాయి, వయస్సులో ఉండగా కోపతాపాలతో రోజులు వెళ్ళిపోతాయి, ముసలితనం వచ్చాక జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటూ ఏడుస్తూ కూర్చొంటాము. వయస్సులో ఉండగా సాధన చేయలేనప్పుడు, కోరిక, కోపంలో నుండి బయటకు రాలేనప్పుడు, ముసలితనం వచ్చాక వల్లకాటికి వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నప్పుడు సాధన చేసి తరిస్తావా? వయస్సులో ఉండగా నీ శరీరాన్ని కోపతాపాలకు అప్పగించి, మంచం పట్టాక నీ శరీరాన్ని నాకు ఇస్తావా? పండు కుళ్ళిపోయిన తరువాత

తినమంటావా అంటున్నాడు పరమాత్మ. భీష్ముడు బలంలో గొప్పవాడు, హృదయంలో గొప్పవాడు, ఏది ధర్మం ఏది అధర్మం అని ఆయనకు తెలుసు. ఇన్ని తెలిసికూడా ధుర్యోధనుడికి ఇచ్చిన మాటకు కట్టుబడి ఇలా తయారయ్యాను అంటాడు. అది తలరాత. అందుచేతనే పెద్దలు ఏమని చెపుతారు అంటే కర్మను బట్టి చుట్టాలు దొరుకుతారు. తీరా పుట్టేసాము కదా చుట్టాలను మార్చుకోలేము. వారు చెడ్డవారు అయినా మంచివారు అయినా అది రాత. మీరు కొంచెం జాగ్రత్తగా వివేకంతో స్నేహితులను ఎంచుకోండి అని చెపుతారు. ఇప్పడు నీవు దేహంతోటి, మనస్సుతోటి ఎలా ఏకంగా ఉంటున్నావో అలాగ చైతన్యంతోటి ఏకం అయ్యేవరకు పుట్టినవాడు చనిపోతాడు, చనిపోయిన వాడు తిరిగి పుడతాడు, నీకు ఇదే పని, గురువు దయ లేకుండా ఈ చక్రంలో నుండి బయటకు రాలేవు. గణపతిశాస్త్రిగారు భగవాన్‌ను అన్నారు నీవు కూరలు బాగా వండుతున్నావు. ఇంకో వంట కూడా నేర్చుకొన్నావు, దాని వలన మాకు ప్రమాదం వస్తోంది. నిన్ను చూడటానికి చాలా మంది వస్తున్నారు, నీవు పైకి అమాయకుడిలాగ కనిపిస్తున్నావు, మామూలుగా వారితో మాట్లాడుతున్నావు, ఏమి చేస్తున్నారు, భోజనం చేసారా, ఎప్పడు వచ్చారు అంటావు, ఏదో మాట్లాడతావు. వారికి తెలియకుండా వారి అహంకారాన్ని ముక్కలుగా కోసి, దాకలో ఉడకేసి, ఆ కూరలతో అరుణాచలేశ్వరుడి అన్నం పెడుతున్నావు. ఇది నీవు చేసే పని రమణేశ్వరా. నీవు వండే బయట కూరలు మాకు కనిపిస్తున్నాయి కాని ఎంతమంది అహంకారాలను కోసి, కూరలుగావండి అరుణాచలేశ్వరుడికి భుజింపచేస్తున్నావో ఇది మాత్రం చాలామంది కళ్ళకు కనబడటంలేదు అన్నారు.

మనం ఏదైతే నేను, నేను అని అంటున్నామో అదే సత్యం, అది సహజం అనుకొంటున్నాము. అది సత్యంకాదు అని ముందు మనకు ఫండమెంటల్‌గా అర్థమయితే తరువాత దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేసుకోవచ్చు. దేహము నేను అనే చిన్న తలంపులో ఇంత గందరగోళం, ఇంత అల్లరి ఉందా, పుణ్యాలు పాపాలు, అదృష్టం దురదృష్టం, జననాలు మరణాలు, కర్మలు ఇన్ని గొడవలు, ఇన్ని కొమ్మలు, ఇన్ని శాఖలు ఉన్నాయా అని భగవాన్‌తో ఒక పండితుడు అన్నాడు. మర్రి విత్తనం ఎంత చిన్నది, అంత చిన్న విత్తనంలో ఇంత పెద్ద చెట్టు, ఆకులు, కొమ్మలు ఉన్నాయి అలాగే దేహము నేను అనే తలంపులో ఇంత అల్లరి ఉంది అన్నారు భగవాన్. కాని ఆ తలంపు అసత్యం. ఆ తలంపును సంతృప్తిపరచు కోవటానికి జీవితం పొడుగునా ప్రయత్నిస్తాము, అదే మాయ. నా పాదాలను ఆశ్రయించ

కుండా, నేను చెప్పిన మాటలు వినకుండా, నేను చెప్పిన మాటలు అర్థం చేసుకొని జీర్ణం చేసుకోకుండా ఈ మాయలో నుండి బయటకు రాలేవు, ఆత్మను పొందలేవు అని పరమాత్మ చెపుతున్నాడు. ఈ దొంగనేను భగవంతుడు చెప్పిన మాటలను నమ్మనివ్వదు. ఎందుచేత నంటే అది కృత్రిమమైనది, అసహజమైనది. అందుచేత సహజమైన దానిని అది ఎలా నమ్ముతుంది. చాలామంది సాధకులు చేసే పొరపాటు ఏమిటి అంటే జరిగిపోయిన గొడవలు తలచుకొని దుఃఖపడతారు, భవిష్యత్‌లో మన జీవితం ఎలాఉంటుంది అని ఊహించుకొంటూ వర్తమాన కాలాన్ని వదిలేస్తారు. ఇది అంతా అనవసరం. ఈ జన్మ ఎందుకు వచ్చింది, ఏ కారణం వలన వచ్చింది అని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. అంతేగాని రాబోయే జన్మలు ఎటువంటివి వస్తాయి అని ఊహించకు, అది మనస్సు చేసే మాయ. ఈ జన్మ ఎంత అసత్యమో రాబోయే జన్మలు కూడా అంతే అసత్యం. బాహ్యపరిస్థితులు అనుకూలంగా ఉంటే పొంగిపోకుండా, ప్రతికూలంగా ఉంటే కుంగిపోకుండా నీ హృదయంలో ఉన్న ఈశ్వర సామ్రాజ్యాన్ని వెతకండి, అందులో ప్రవేశించండి. మీకు ఎప్పడు, ఏమి కావాలో అన్నీ ఈశ్వరుడే చూసుకొంటాడు, ప్రత్యేకంగా నీ ప్రయత్నం ఏమీ అక్కరలేదు. ఏ సంస్కారమువలన, ఏ కారణం వలన ఈ శరీరం వచ్చిందో ఆ సంస్కారములను తొలగించుకోవటం మానివేసి, ఆ కారణాలను కాల్చి బూడిద చేయటం మానేసి మరల శరీరం ఎటువంటిది వస్తుంది, జన్మ ఎటువంటిది వస్తుంది అనే గొడవ ఎందుకు. ఏ సంస్కారముల వలన ఈ శరీరం వచ్చిందో మరల అవే కొత్త శరీరాన్ని తీసుకొని వస్తాయి. సత్వగుణం ఉంటే సరిపోతుందా, సత్వగుణం నేర్చుకొంటే సరిపోతుందా, అది స్వాభావికం అవ్వాలి కదా. కర్ణుడికి దాన గుణం ఎలా సహజంగా ఉందో అలాగ సత్వగుణం నీకు సహజం అవ్వాలి, స్వాభావికం అవ్వాలి. రెండు చిలుకలు ఉన్నాయి, అవి అక్క చెల్లెళ్ళు, అందులో ఒక చిలుకను దొంగోడు పట్టుకొని వెళ్ళాడు, ఒక చిలుకను ఋషి పట్టుకొని వెళ్ళాడు. ఒక రాజుగారు వేటకు వెళ్ళి దొంగోడు పట్టుకొని వెళ్ళిన చిలుక ఉన్న చోటుకు వచ్చాడు. దొంగ లోపలే ఉన్నాడు, చిలుక బయట ఉంది. వచ్చాడు, పట్టుకోండి, తన్నండి అంటోంది ఆ చిలుక. తరువాత రాజుగారు ఋషి ఆశ్రమానికి వెళ్ళాడు. అక్కడ చిలుక దయచేయండి, కూర్చోండి, మా స్వామి వస్తారు అని మర్యాద చేస్తుంది. ఇవి అన్నీ సహవాస దోషాలు, మనుషులు కూడా అంతే. స్నేహాలనుబట్టి అభివృద్ధి లోనికి వస్తారు, స్నేహాలను బట్టి పాడైపోతారు. స్నేహాలు మంచివి అయితే చెడ్డవారు మంచి వారు అవుతారు. స్నేహాలు మంచివి కాకపోతే మంచివారు చెడ్డవారు అవుతారు. వివేకాన్ని,

వైరాగ్యాన్ని పెంచుకో, రాబోయే జన్మల గురించి ఆలోచిస్తూ కూర్చోవద్దు. ఒకవేళ జన్మలు వచ్చినా అవి అసత్యమే. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. కాలాన్ని పాడుచేసుకోవద్దు. నీ ప్రారబ్దకర్మను బట్టి చాలా జన్మలు వచ్చే యోగం ఉంది అనుకో, ఎంతగడ్డిమేటు అయినా చిన్న అగ్గిపుల్ల గీస్తే దగ్ధం అయిపోతుంది. అలాగే ఆత్మజ్ఞానం మొత్తం నీ ప్రారబద్ధ కర్మను దగ్ధం చేస్తుంది, అట్టిది జ్ఞానం.

అహంభావన ఉన్నంతకాలం మనిషి కూడా నీడ వచ్చినట్లు మనకూడా అశాంతి వస్తుంది. మనం పది పైసలు సేవ చేస్తాము, తొంబై పైసలు పబ్లిసిటీ కోరుకొంటాము. నీవు చేసే సేవ వలన వచ్చే పుణ్యం చాలా తక్కువ, కాని పబ్లిసిటీ కోరుకోవటం వలన అహంభావన పెరిగిపోతుంది, జీవుడు నరకానికి ప్రయాణం చేస్తాడు. రాజకీయ నాయకులు ఓట్ల కోసం పబ్లిసిటీ చేసుకొంటారు, భక్తులకు పబ్లిసిటీ గొడవ ఎందుకు? నెగ్గక ముందు మీకు సేవ చేస్తాము అని పదిసార్లు మన దగ్గరకు వస్తారు, నెగ్గిన తరువాత మన మీద యజమాని అనుకొంటారు, ఇదే మాయ. ఎవరైనా మంత్రి అయ్యారు అనుకోండి, నాకు అధికారం వచ్చేసింది, నేను గొప్పవాడిని అయిపోయాను అని పైకి అనకపోయినా, లోపల అనుకొంటాడు. రాముడిని రాజుగా నిర్ణయించాము, పట్టాభిషేకం చేస్తాను అని దశరథ మహారాజు కౌసల్యతో అంటాడు. నేను రాజును అవుతున్నాను అని రాముడు అనలేదు. రేపటి నుండి నా కర్తవ్యం నిర్వర్తించాలి అని తల్లితో రాముడు అంటాడు. కర్తవ్యం అంటే అధికారం అనుకొంటున్నాము. కర్తవ్యం వేరు, అధికారం వేరు. చనిపోవటం, పుట్టటం నూటికి నూరుపాళ్ళు దేహానికి సంబంధించినది. శరీరం యొక్క చావు పుట్టుకలను, మనస్సులో వచ్చే బెంగలను చైతన్యం మీద ఆరోపించుకొంటున్నావు. ఎంతకాలం అయితే శరీరంతో ఏకమై ఉంటావో అంతకాలం, నీవు చావులేని సత్య వస్తువు అయినప్పటికీ నేను చనిపోతున్నాను, నేను పుడుతున్నాను అని అనుకొంటూనే ఉంటావు. దేహభావన ఉన్నంతవరకు చావు పుట్టుకలు తప్పవు. దేహము నేను అనుకొనే వాడే నరకాసురుడు, వాడే రాక్షసుడు, వాడిని శిలువ వెయ్యి. నేను ఉన్నాను అది ఒక్కటే సత్యం. నేను అలా ఉన్నాను, నేను ఇలా ఉన్నాను అనుకొనేది నూటికి నూరు పాళ్ళు అసత్యం, అది మాయ యొక్క వికారం, దాని వలన అహంభావన పెరుగుతుంది. మీరు ఇంటి దగ్గర కూర్చుని నేను చనిపోతున్నాను అంటే మీ మాటలను నేను అంగీకరించను. ఆ తలంపును పోగొట్టటమే నా ఉద్దేశ్యం. ఆ తలంపును వేరుతో సహా నశింపచేయటమే నా బోధ యొక్క గమ్యం.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 06-04-06 | గురు | పాలకోడేరు, రామాలయం |
| 09-04-06 | ఆది | పిప్పర |
| 12-04-06 | బుధ | భీమవరం, మధ్యాహ్నం గం॥ 3-00లకు |
| 19-04-06 | బుధ | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం |
| 28-04-06 | శుక్ర | విజయవాడ |
| 11-05-06 | గురు | భీమవరం |
| 17-05-06 | బుధ | గుమ్మలూరు |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# అహంకారము – ఆత్మ

అనంతము, అద్వితీయము, శుద్ధ చైతన్యమూ అయిన బ్రహ్మములో 'నేను' అనుకొనే వ్యక్తిభావన సముద్రములోని ఒక నీటి బుడగలాంటిది మాత్రమే! నేను అనే తొలితలంపు అఖండాద్వైతస్థితి నుండి భావనాపరంగా వ్యక్తిని వేరు చేస్తుంది. అహంకారము నీటిబుడగ అయితే, 'నిజమైన-నేను' అనగా 'ఆత్మ' మహా సముద్రము లాంటిది. వ్యక్తి తాను ఆత్మకన్న భిన్నుడనని భావించడం, సముద్రములోని నీటి బుడగ తాను సముద్రముకన్న వేరుగా ఉన్నట్లు భావించడం లాంటిదే! నీటి బుడగకు ఉనికి సముద్రములోనే, సముద్రముగానే తప్ప దానికి భిన్నముగా లేదు. నీటి బుడగను విచారణ చేస్తే ఆ స్థానంలో సముద్రమే అనగా నీరే దర్శనమిస్తుంది. అట్లే అహంభావనను విచారణ చేస్తే దాని మూలములో అది నశించి పూర్ణమైన బ్రహ్మమే తాను అవుతుంది. అహంభావనకు ఆత్మకన్న భిన్నముగా ఉనికియే లేదు. అహంకారము ఆత్మకన్న భిన్నుడనని భావించుటయే అజ్ఞానము. అట్టి వేరు భావనయే దుఃఖమునకు, జన్మ పరంపరకు కారణమవుతుంది. అహంకారము సత్యము కాదు కాబట్టి, భ్రాంతి జన్యము కాబట్టి దానిని విచారణ చేస్తే అది వేదను సత్యము. తెలిసి ఆస్థానములో బ్రహ్మమే మిగులుతుంది. అహంకారము తన మూలమైన శుద్ధచైతన్యంలో తన ఉనికిని కోల్పోవడమే సాధన గమ్యం.

**- చావలి సూర్యనారాయణమూర్తి**

**టీచర్, అమలాపురం**

# శరీరాన్ని ఆడించేది వాసనలే

సంచిత కర్మను ప్రారబ్ద కర్మగా అనుభవించే పరికరమే మనస్సు. మమకారంతో కూడిన అభిమానాలనే, పాశమని, వాసనలు అని, మనస్సు అని అంటారు. మసక చీకటిలో తాడును పామని భ్రమించటానికి కారణం చీకటే. అలాగే లేని దాని మీద సద్భావన కల్పించటం మనస్సు స్వభావం. కారణం అదే మాయ కాబట్టి. మనస్సు గురించి తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది. తన స్వభావం ఏమిటో తెలియనియ్యకుండా చాకచక్యంగా తప్పించుకొని తన మనుగడకు తగ్గట్లుగా మనలను నడిపించుకొంటుంది. శరీరమే రథం. ఇంద్రియాలే గుఱ్ఱాలు, బుద్ధే సారథి. వాసనలు బలంగా ఉంటే బుద్ధి అయిన సారథి గుడ్డివాడై రథం గోతిలో పడుతుంది. మనం దుమ్ములో పొర్లాడి ఏడుపులతో ఉంటాము. వేమన "లెక్కలేని ఆశ లీలమై యుండగా, తిక్క పట్టి నరుడు తిరుగు గాక, కుక్క వంటి మనస్సు కూర్చోనిచ్చునా" అన్నారు. మనం వివేక వైరాగ్యాలకోసం శ్రద్ధగా ప్రయత్నం చేస్తే భ్రమలు తొలగిపోతాయి. వాసనలు ప్రకోపించినప్పుడు క్రోధంతోను, కామంతోనూ శరీరం ఊగిపోతుంది. సామాన్యుని ఇంద్రియాలు తన చుట్టూ ఉండే విషయాల సమాచారాన్ని సేకరించి మనస్సుకు అందిస్తూ వార్తాహరునిలా, బానిసలా పనిచేస్తూ ఉంటాయి. దానితో వాసనల చేతిలో శరీరం బంధీగా ఉంటుంది. జ్ఞాని ఇంద్రియాలతో చూస్తూ ఉన్నా ఏ సంక్షోభం లోనూ చిక్కుకోడు. కారణం అతని మనస్సు చైతన్య సాగరంలో ఆనందంగా ఉంటుంది. మదపుటేనుగు యొక్క గండ స్థలమును చీల్చటం సులభమే కాని వాసనలను నిగ్రహించటం కష్టం. ఆలోచనలు నశించటమే ముక్తి ఆలోచనా ప్రవాహంలో కొట్టుకుపోవటమే బంధం. శ్రీ నాన్నగారు "నీ వాసనలు అనే బండ రాళ్ళను నీ స్వప్రయత్నంతో నీవు తొలగించుకోలేవు. నీవు ప్రయత్నం చెయ్యటమంటే మదపుటేనుగుతో దోమ పోరాటం లాంటిది. (అంటే ఎన్నో జన్మల నుంచి పోగుచేసుకొన్నది అని) దానికి సింహంలాంటి గురువు చూపుతో ఆ ఏనుగు గడగడలాడి మరణిస్తుంది" అన్నారు. "ఇంద్రియాల ద్వారా పొందే సుఖమంతా దుఃఖమే, పాపమే పరాధీనతే" అన్నారు మహావీరుడు. కాబట్టి ప్రకృతి వస్తువులను వాసనలతో కాకుండా దైవనేత్రంతో దర్శించటమే నిజమైన విద్య అని గ్రహించి ఆచరించాలి, సుఖించాలి.

– **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం